క్లుప్తంగా

శ్రీరామకొండపై ప్రత్యేక పూజలు



కోయిల్‌కొండ: మండలంలో శ్రీరామకొండ క్షేత్రంలో కార్తీకమాస అమావాస్య సందర్భంగా మంగళవారం సీతారామచంద్రులకు ఆలయ అర్చకుడు రాఘవేందర్‌రావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా స్వామివారికి పంచామృతాభిషేకం, తులసి, అష్టోత్తర శత నావాళి పూజలు నిర్వహించినట్లు తెలిపారు. అంతకుముందు స్వామివారిని ప్రత్యేక పూలతో అలంకరించారు. అదేవిధంగా కొండపై వచ్చిన భక్తులకు తీర్థప్రసాదాలు ఇచ్చారు.

అన్నదానానికి విరాళం అందజేత



భూత్పూర్: పట్టణంలోని మునిరంగ స్వామి దేవాలయం అయ్యప్ప సేవా సమాజం ఆధ్వర్యంలో చేపడుతున్న అన్నదానానికి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కేసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి రూ.51వేల చెక్కును నిర్వాహకులకు మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో వెంకట్ నర్సింహారెడ్డి, లిక్కి నవీన్‌గౌడ్, వెంకట్ రెడి, మల్లేష్ బాలవర్ధన్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

నేడు మండల సమావేశం

హన్వాడ: మండల కేంద్రంలోని మండల పరిషత్ సమావేశ మందిరంలో బుధవారం సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ ధనుంజయగౌడ్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. మండలంలోని సభ్యులు, అధికారులు తమ శాఖ పరిధిలోని ప్రగతినివేదికలతో హాజరుకావాలని ఆయన కోరారు.

ఎమ్మెల్యేను కలిసిన అధికారులు

కోయిల్‌కొండ: ఎంపీడీఓ జయరాములు, వ్యవసాయాధికారి రాంపాల్, ఏపీఓ నర్సయ్య నారాయణపేట ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డిని కలిసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కోయిల్‌కొండ మండలాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపట్టాలని ఆమె అధికారులకు సూచించారు.

ఎమ్మెల్యేను కలిసిన వీసీ

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీ వీసీ లక్ష్మీకాంత్‌రాథోడ్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డిని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా శాలువాతో సన్మానించి, పుష్పగుచ్ఛం అందజేశారు. ఆయన వెంట రిజిస్ట్రార్ గిరిజ, ఓఎస్డీ మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

పీయూ హాకీ జట్టు ఎంపికలు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీ హాకీ జట్టును ఎంపికలు ఈనెల 15 వనపర్తి ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహిస్తున్నట్లు పీడీ శ్రీనివాస్ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు బోనోఫైడ్, ఆధార్‌కార్డుతో ఎంపికలకు హాజరు కావాలని పేర్కొన్నారు.

యూడైస్ సకాలంలో పూర్తి

హన్వాడ: మండలంలోని అన్ని పాఠశాలల్లో యూడైస్, డ్రాఫ్‌బాక్స్ క్లియరెన్స్ ఓఎస్‌సీ సర్వేను సకాలంలో పూర్తి చేసి నివేదికలను అందించాలని ఎంఈఓ రాజునాయక్ సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎమ్మార్సీలో పీఎస్, యూపీఎస్, ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలకు యూడైస్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఎన్‌ఓ- ఎఫ్‌ఎల్‌ఎన్ వెంకట్రాములు, కాంప్లెక్స్ హెచ్‌ఎం విజయభా తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లను ఆదుకోవాలని వినతి



మిడ్జిల్: ఆర్టీసీ బస్సులలో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడంతో ఆటోలలో ఎవరూ ప్రయాణించడం లేదని మండల ఆటో యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం ర్యాలీ నిర్వహించి తహసీల్దార్ రాజునాయక్ వినతి పత్రం ఇచ్చారు. ఆటోలను నమ్ముకుని జీవిస్తున్న తమ కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో సలీం, రాములు, మధు, రమేష్, జంగయ్య, లక్ష్మయ్య, నరేందర్ తదితరులు ఉన్నారు.

బస్సే లేదు...'ఉచిత'మేలా?

- కరోనా నుంచి బస్సుకు నోచుకోని గ్రామాలు
- ప్రైవేట్ వాహనాల్లో సామర్థ్యానికి మించి ప్రయాణం



సాలార్‌నగర్ వద్ద బోల్తా పడ్డ ఆటో (ఫైల్)

గండేడ్: అసలు గ్రామాలకు బస్సు సౌకర్యమే లేకుంటే.. ఉచితమేలా అంటూ పలు గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాక చదువుకోవడానికి వెళ్లే విద్యార్థులతో పాటు ఆయా గ్రామాల ప్రజలు నానా తంటాలు పడుతున్నారు. గత్యంతరం లేక సామర్థ్యానికి మించి ప్రైవేట్ వాహనాల్లో ప్రయాణిస్తూ తరుచుగా ప్రమాదాల బారిన పడుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో బస్సు సౌకర్యం కల్పించాలని పలుమార్లు వినతులు ఇచ్చినా పాలకులు, అధికారులు పట్టించుకోలేదు. ఫలితంగా పలు గ్రామాల ప్రజలు ఆర్టీసీ సేవలకు దూరమయ్యాయి. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహిళలకు ఉచిత బస్సు పథకానికి సైతం వీరు నోచుకోని పరిస్థితి నెలకొంది. ఉమ్మడి గండేడ్ మండలంలోని 49 పంచాయతీలు ఉండగా, 30కి పైగా అనుబంధ గ్రామాలు ఉన్నాయి. ఎక్కువగా నంచర్ల–పరిగి, రంగారెడ్డిపల్లి–పరిగి, సల్కర్‌పేట్–పగిడ్యాల్ రూట్లోనే ఉన్నాయి. జాతీయ రహదారి అయిన మహబూబ్‌నగర్ –చించోళి రహదారిని ఆనుకుని తక్కువగా గ్రామాలు ఉన్నాయి. ఈ జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న గ్రామాలకు రవాణా సౌకర్యం మెరుగా ఉన్నా మిగతా గ్రామాలకు మాత్రం బస్సు సౌకర్యం లేదు.

కరోనా నుంచి బస్సులు బంద్

గండేడ్ మండలంలోని రంగారెడ్డిపల్లి–పరిగి రూట్లో పగిడ్యాల్, కొత్లాబాద్ వరకు బస్సు నడిచేది. సుమారు 50 కిలోమీటర్ల మేర మండలంలో బస్సు ప్రయాణించేది. 2019 చివరిలో కరోనా రావడం 2020 మార్చికల్లా తీవ్ర రూపం దాల్చడంతో అప్పట్లో నెలల తరబడి లాక్‌డౌన్ పెట్టారు. దీంతో ప్రయాణాలు నిలిచిపోవడమే కాక బస్సులు కూడా బంద్ అయ్యాయి. కరోనా తగ్గుముఖం పట్టినా ఈ రూట్లో బస్సు సౌకర్యం మాత్రం పునరుద్ధరించ లేదు. దీంతో జిన్నారం, జక్లపల్లి సాలార్‌నగర్, చిన్నవార్వాల్, పెద్దవార్వాల్, మన్సూర్‌పల్లి, మన్సూర్‌పల్లి తండా, పగిడ్యాల్, బల్సుర్‌గొండ, కొండాపూర్ గ్రామాల ప్రజలకు బస్సు ఎక్కే అవకాశం లేకుండా పోయింది. సల్కర్‌పేట్, పగిడ్యాల్ రూట్లో ఉండే వారి పరిస్థితి మరీ దారుణంగా ఉంది. పరిగి నుంచి మూడు సార్లు బస్సులు తిరిగేవి. ప్రస్తుతం ఒక్క ట్రిప్పు కూడా తిరగడం లేదు.

పల్లెవైపు చూడని పల్లె వెలుగు

జక్లపల్లి నుంచి మొకర్లాబాద్ వరకు 19.5 కిలో మీటర్ల దూరం ఉంది. కొత్తగా బీటీ రోడ్డు వేశారు. రెండు మండలాల ప్రజలకు ఇది దగ్గరగా అయ్యే దారి. అటు మహబూబ్‌నగర్, పరిగి వెళ్లేందుకు ఇతర మండలాలకు వెళ్లేందుకు ఇది సౌకర్యమైన రోడ్డు. ఈ రూట్లో బస్సు రవాణా కల్పిస్తే దాదాపు 15 గ్రామాలకు మేలు కలుగుతుంది. దీంతో పాటు చెల్మిల్ల నుంచి జిన్నారం మీదుగా కోస్గికి కూడా బస్సు సౌకర్యం లేదు. అలాగే జానంపల్లి మీదుగా గోవిందుపల్లి, గోవిందుపల్లి తండాలకు సైతం బస్సు సౌకర్యం లేదు.

ఎక్కడికి వెళ్లాలన్న ఇబ్బంది..



బస్సు లేక ఎక్కడికి వెళ్లాలన్న ఇబ్బందిగా ఉంది. మూడేళ్లుగా గ్రామానికి బస్సు రావడం లేదు. ఒక్కోసారి కాలినడకన వచ్చిన సందర్భాలు ఉన్నాయి. ప్రభుత్వం ఉచిత బస్సు పథకాన్ని బస్సు సౌకర్యం లేక పొందలేకపోతున్నాం.

– పార్వతమ్మ, పెద్దవార్వాల్

లిఫ్టు అడిగి వెళ్తున్నా..



గండేడ్‌లో ఓ కళాశాలలో ఇంటర్ చదువుతున్నా. పెద్దవార్వాల్ నుంచి రోజూ గండేడ్‌కు వెళ్లాలి. ఉదయం పూట అన్న గండేడ్‌లో విడిచిపెడతాడు. సాయంత్రం మాత్రం ఎవరినైనా లిఫ్టు అడుతున్నా. ఒక్కో సారి ఉదయం కూడా ఏదీ దొరక్కపోతే నడిచి వెళ్తున్నాం. ప్రైవేట్ వాహనాలు కూడా సమయానికి దొరకడం

– చందన, విద్యార్థిని

త్వరలో బస్సులు తిప్పుతాం..



ఉచిత ప్రయాణం కారణంగా మహిళా ప్రయాణికుల సంఖ్య 30 శాతం పెరిగింది. ఆర్టీసీ అధికారులతో మాట్లాడాం. దీంతో కొత్త బస్సుల అవసరం ఏర్పడింది. ఎక్కడెక్కడ ఎన్ని అవసరమవుతాయో గుర్తించి బస్సుల ఏర్పాటుకు కృషి చేస్తాం.

– రామ్మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే, పరిగి

ఎమ్మెల్యేను సన్మానించిన రెడ్డి సేవా సమితి

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డిని పాలమూరు రెడ్డి సేవా సమితి ప్రతినిధులు పూలబొకె అందజేసి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు తూము ఇంద్రసేనారెడ్డి, ప్రధాన కార్యదర్శి వేపూరు రాజేందర్‌రెడ్డి, మల్లు నర్సింహారెడ్డి, వెంకట్రాంరెడ్డి, సురేందర్‌రెడ్డి, కోటేశ్వర్‌రెడ్డి, పరమేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. జిల్లా కేంద్రంలో ట్యాక్సీ డ్రైవర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గ్యారీ్వ వేడుకల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు.



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న సమితి ప్రతినిధులు

పూడిపూజలో పాల్గొన్న మాజీ మంత్రి



స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రంలోని మోనప్పగుట్టలో మంగళవారం ఏర్పాటు చేసిన అయ్యప్పపడి పూజలో మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వామివారికి హారతి ఇచ్చారు. భక్తిగీతాలతో ఆ ప్రాంతం అయ్యప్ప నామ స్మరణతో మార్మోగింది. పలువురు కౌన్సిలర్లు, భక్తులు పాల్గొన్నారు.

29వ వార్డులో 'భగీరథ' లీకేజీలు



మదీన మసీదు ఎదురు గల్లీలో లీకేజీ కారణంగా బీటీరోడ్డుపై పారుతున్న తాగునీరు



కుమ్మరివాడి నుంచి మదీన మసీదుకు వెళ్లే దారిలో ఇలా..

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: జిల్లా కేంద్రంలోని 29వ వార్డు పరిధిలోని కుమ్మరివాడి నుంచి మదీన మసీదు రోడ్డు వరకు రెండు చోట్ల మిషన్ భగీరథ పథకం పైపులైన్‌కు లీకేజీలు ఏర్పడ్డాయి. మరోచోట పబ్లిక్ నల్లా రోడ్డుకు సమాంతరంగా ఉన్నా ఆన్‌ఆఫ్ దెబ్బతినడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. సమీపంలోని పవర్ బోరు ద్వారా వాటర్ ట్యాంకును నింపి నీరు వదిలినప్పుడల్లా రోడ్డుపై వృథాగా ఏరులై పారుతోంది. ఈ పరిస్థితి నెలకొని సుమారు ఆరు నెలలైనా ఎవరూ పట్టించుకోవడం లేదని స్థానికులు చెబుతున్నారు. ఈ ప్రాంతంలో నడవడానికి సైతం వీలు కావడం లేదని వాపోతున్నారు. ఈ విషయమై మున్సిపల్ ఏఈ వైష్ణవిని వివరణ కోరగా.. త్వరలోనే అక్కడికి సిబ్బందిని పంపించి వీటిని బాగు చేయిస్తామన్నారు.

పలు చోట్ల తరచూ లీకేజీలు..

ఇదిలా ఉండగా పట్టణంలోని వివిధ వార్డుల్లో తరచూ మిషన్ భగీరథ పథకం పైపులైన్ మరమ్మతుకు గురవుతోంది. గత నెలలో వార్డు నంబర్ 46 పరిధిలోని నాగయ్యవీధి నంబర్–1 వద్ద లీకేజీ అయితే మరమ్మతు చేశారు. అలాగే ప్రస్తుతం 10వ వార్డులోని మర్లు, విష్ణువేశ్వరకాలనీ, వార్డు నంబర్ 21లోని బీకేరెడ్డి కాలనీలోనూ పలుచోట్ల బాగు చేస్తున్నారు. ఇక వార్డు నంబర్ 44 పరిధిలోని బండ్లగేరిచౌరస్తా సమీపంలో రెండు చోట్ల నడిరోడ్డుపై ఈ పైపులైన్‌కు ఏర్పడిన లీకేజీలను ఈనెల 11న మున్సిపల్ సిబ్బంది సరిచేసిన విషయం విధితమే.

నసరుల్లాబాద్‌లో శిలాఫలకం ధ్వంసం

జడ్చర్ల: మండలంలోని నసరుల్లాబాద్ శివారులో గల వైకుంఠధామం వద్ద సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు శిలాఫలకాన్ని ధ్వంసం చేసినట్లు సర్పంచ్ ప్రణీల్‌చందర్ తెలిపారు. రూ.20 లక్షలతో వైకుంఠధామాన్ని నిర్మించి ప్రారంభించామని, కాంగ్రెస్ పార్టీకి చెందిన వారు శిలాఫలకాన్ని ధ్వంసం చేశారని ఆరోపించారు. వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పాఠశాలల తనిఖీ

మిడ్జిల్: మండలంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల, అయ్యవారిపల్లి ప్రాథమిక పాఠశాలను మంగళవారం ఎంఈఓ మంజులాదేవి, ఎఫ్‌ఎల్‌ఎన్ నోడల్ అధికారి వెంకటయ్య తనిఖీ చేశారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరును పరిశీలించారు. విద్యార్థులకు ఉదయం రాగి జావాను అందజేయాలని సూచించారు. డీఈఓ ఆదేశాల మేరకు బుధవారం నుంచి జనవరి 10వరకు మండలంలో 6–14 ఏళ్ల బడిబయట పిల్లల సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

రామాలయంలో కార్తీక లక్షదీపోత్సవం

స్టేషన్ మహబూబ్‌నగర్: కార్తీక మాసం చివరి మంగళవారాన్ని పురస్కరంచుకుని జిల్లా కేంద్రం టీచర్స్‌కాలనీలోని రామాలయంలో కార్తీక లక్షదీపోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో వివిధ ఆకృతుల్లో కార్తీక దీపాలను వెలిగించారు.

శ్రీగిరిక్షేత్రంలో..


జడ్చర్ల టౌన్: మండలంలోని శ్రీగిరిక్షేత్రం అష్టలక్ష్మి ఆలయంలో అమావాస్య సందర్భంగా లోక కల్యాణార్థం చండీహోమం చేశారు. ఆచార్య కృష్ణస్వామి నేతృత్వంలో అమ్మవారికి పంచామృతాభిషేకం, కుంకుమార్చన చేసి హోమం నిర్వహించారు. బాదేపల్లి పెద్దగుట్ట వీరభద్రుడి ఆలయంలో ఉదయం నుంచి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.



జడ్చర్లలో పల్లకీసేవ నిర్వహిస్తున్న భక్తులు

మీనాంబరం ఆలయంలో..

జడ్చర్ల: మండలంలోని ఆల్వాన్‌పల్లి సమీపంలో మీనాంబరం ఆలయంలో కార్తీక మాసం ఉత్సవాలలో మాస శివరాత్రిని పురస్కరించుకుని పరుసవేదీశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రుద్రాభిషేకం, పల్లకీసేవ, ప్రసాద వితరణ, భజనలు, ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించారు.



త్రిశూలం ఆకారంలో కార్తీక దీపాలు



వివిధ ఆకృతుల్లో కార్తీక దీపాలు



రామాలయంలో కార్తీక దీపాలను వెలిగిస్తున్న భక్తులు

నేడు ఎంబీసీ చర్చిలో క్రిస్మస్ వేడుకలు

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రంలోని కల్వరి ఎంబీసీ చర్చి ఆవరణలో బుధవారం సాయంత్రం 6 గంటలకు క్రిస్మస్ వేడుకలు నిర్వహిస్తున్నట్లు చర్చి కమిటీ చైర్మన్, పాస్టర్ రెవ.వరప్రసాద్ వెల్లడించారు. మంగళవారం చర్చి సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పాపులను రక్షించుటకు ఏసు ప్రభువు ఈ నెలలోనే జన్మించారని తెలిపారు. క్రీస్తు చూపిన ప్రేమ, అనురాగం యావత్ ప్రపంచానికి ఆదర్శమని, ఆయన చూపించిన మార్గంలో నడిచిన వారికి అన్ని శుభాలే కలుగుతాయని పేర్కొన్నారు. ఎంబీసీ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పేదలకు తమవంతుగా ప్రతి నెల కొంత ఆర్థిక సాయం చేస్తున్నట్లు వివరించారు. ఈ నెల 25వ తేదీన క్రీస్తు జన్మదినాన్ని నిర్వహిస్తారని, అంతకు ముందే క్రైస్తవులు క్రిస్మస్ వేడుకలను నిర్వహిస్తారని వెల్లడించారు. అందులో భాగంగానే బుధవారం సాయంత్రం పలు సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రముఖుల సందేశాలు ఉంటాయని తెలిపారు. హైదరాబాద్‌లోని డెస్టినేషన్ చర్చి పాస్టర్ సైలస్ రెజినాల్డ్ ముఖ్య సందేశం ఇస్తారని పేర్కొన్నారు. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి పాల్గొంటారని తెలిపారు. అనంతరం వేడుకల బ్రోచర్లను ఆవిష్కరించారు. సమావేశంలో చర్చి వైస్ చైర్మన్ బీఐ.జేకబ్, కార్యదర్శి జేఐ.డేవిడ్, కోశాధికారి టీఏ.స్టిఫెన్, ఇమ్మాన్యుయేల్ రాజు, దాసరి సుందర్, కన్నా తదితరులు పాల్గొన్నారు.



క్రిస్మస్ వేడుకల బ్రోచర్లను ఆవిష్కరిస్తున్న రెవ.వరప్రసాద్ తదితరులు

ఉత్తమ సేవలు అందించాలి



ఆస్పత్రిలో రోగులను పరిశీలిస్తున్న జరీనాబేగం

గండేడ్: ఆరోగ్య కేంద్రంలో రోగులకు ఉత్తమ సేవలు అందించాలని జిల్లా లెప్రసీ ప్రోగాం ఆఫీసర్ జరీనాబేగం పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఆరోగ్య కేంద్రాన్ని ఆమె పరిశీలించారు. ఆస్పత్రిలో వసతులు, సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. లేబర్, ల్యాబ్, థియేటర్ వాటిని పరిశీలించారు. అలాగే ఓపీ, కాన్పులు, గర్భిణులపై ఆరా తీశారు. ఆరోగ్య కేంద్రంలోని వివిధ రకాల రికార్డులను చూశారు. కొందరు లెప్రసీ రోగులను ఆమె పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్పత్రిలో కాన్పులు అయ్యేలా చూడాలని అందుకనుగుణంగా వారిని ప్రోత్సహించాలని వైద్య సిబ్బందికి సూచించారు. ఆమె వెంట వైద్యాధికారి చంద్రశేఖర్, సీహెచ్‌ఓ రాములు, వైద్య సిబ్బంది ఉన్నారు.

ఇసుక తరలిస్తే కఠిన చర్యలు

నవాబుపేట: మండలంలో అనుమతి లేకుండా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తప్పవని మైనింగ్ ఏడీ విజయ్‌కుమార్, తహసీల్దార్ మల్లికార్జున్‌రావు తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. మండల సరిహద్దులోని దుందుబీ వాగు పరిసర ప్రాంతాల్లో రాజాపూర్ మండల సరిహద్దులో ఇసుక తరలింపుపై ఆరోపణలు వస్తున్నాయని తెలిపారు. ఈ విషయంలో అక్రమంగా కృత్రిమ ఇసుక తరలిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశం అనంతరం వారు ఇప్పటూర్, కారూర్ సరిహద్దు ప్రాంతాలు పరిశీలించి ఇసుక తరలింపు విషయంలో హెచ్చరికలు జారీ చేశారు. సమావేశంలో ఏఎస్ఐ ఆనంద్, రెవెన్యూ సిబ్బంది కిరణ్, బంగారప్ప తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మైనింగ్, రెవెన్యూ అధికారులు

సమాధులు తవ్వారని ఫిర్యాదు

నవాబుపేట: మండలంలోని ఇప్పటూర్ సరిహద్దులో కొందరు సమాధులు తవ్వారని దళిత సంఘాల నాయకులు ఆరోపించారు. ఈ సందర్భంగా మంగళవారం తహసీల్దార్ మల్లికార్జున్‌రావుకు వినతిపత్రం అందించారు. ఇప్పటూర్ సరిహద్దులో దళితులకు చెందిన సమాధులను రాజాపూర్ మండలానికి చెందిన వ్యక్తి తవ్వినట్లు వారు తెలిపారు. ఏళ్ల తరబడి ఉన్న సమాధులను తన భూమి అంటూ అక్రమంగా తవ్వటం సరికాదని అన్నారు. ఈ విషయంలో రెవెన్యూ అధికారుల బృందం ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టింది. ఇప్పటూర్ చెందిన వ్యక్తులు తమ కుటుంబసభ్యుల సమాధులు తవ్వినట్లు ఫిర్యాదు చేయగా, ఆ భూమి రాజాపూర్ మండలం తిర్మలాపూర్ చెందినదని, మా భూమిని అక్రమంగా లాక్కుని తాజాగా సమాధులు తవ్వారంటూ ఫిర్యాదు చేశారని రాజాపూర్ మండలానికి చెందిన కృష్ణయ్య వివరించారు. దీంతో సరిహద్దు ఎక్కడి మండలానికి వస్తుందని, సమాధులు ఎవరికి సంబంధించినవన్న విషయంలో విచారణ చేస్తున్నామని, సరిహద్దు విషయం కావటంతో సర్వే చేసి తేల్చాల్సి ఉందని అధికారులు తెలిపారు. ఈ విషయంలో పూర్తి విచారణ అనంతరం చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ తెలిపారు. తహసీల్దార్‌కు వినతిపత్రం అందించిన వారిలో ఆనంద్, శాంతయ్య, రాములు, చెన్నయ్య తదితరులు ఉన్నారు.

ఆశయం బతికించింది



వేప చెట్టుపై పెరిగిన రావి చెట్టు

అడ్డాకుల: బతకాలనే సంకల్పం.. ఎదగాలనే ఆశయం ఉండాలే గానీ ఎలాంటి పరిస్థితులనైనా ఎదురొడ్డి నిలవొచ్చని ఈ వృక్షాన్ని చూస్తే అర్థమవుతుంది. అడ్డాకుల మండలంలోని కాటవరం శివారులో 44వ నంబర్ జాతీయ రహదారి పక్కన ఉన్న వేప చెట్టు ఇది. ఈ చెట్టు పైన రావి చెట్టు మొలకెత్తింది. వేప చెట్టు కాండం ఆధారంగా రావి చెట్టు పెరిగి దీనికి సంబంధించిన వేర్లు కిందకు వచ్చి భూమిలోకి వెళ్లాయి. భూమి ఆధారంగా లేకుండా కేవలం ఒక చెట్టుపైనే మరో చెట్టు జీవం పోసుకుని పెద్దదై కనిపిస్తుండటంతో రహదారిపై వెళ్లే ప్రయాణికులు ఆసక్తిగా తిలకిస్తున్నారు.